
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం। 23। ఆగస్టు। 2024



సోమశిలలో 27.78 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారానికి 27.78 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 12,200 క్యూసెక్కుల వరద వస్తోంది. దిగువకు 2,205 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,780
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,683
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,883
సవర (8 గ్రాములు)	రూ.55,064

గరిష్ఠం/కనిష్ఠం
38.4 /28.2

వాతావరణం

గాలిలో తేమ 67 శాతంగా గురువారం నమోదైంది. జిల్లాలో వాతావరణం శుక్రవారం ఆకాశం మేఘావృతంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

అశ్వవాహనంపై వెంకయ్యస్వామి చిద్విలాసం



వెంకటాచలం: గొలగమూడిలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి 42వ ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం అశ్వవాహన సేవ నిర్వహించారు. ఉదయం స్వామి ఉత్సవ మూర్తిని అశ్వవాహనంపై కొలువుదీర్చి ప్రత్యేక పూలాలంకరణ చేశారు. ట్రాక్టర్‌పై ఆశీనులను చేసి ప్రత్యేక పూజల అనంతరం గ్రామోత్సవాన్ని చేపట్టారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా సాగింది. ఉత్సవం ముందు మహిళల కోలాట ప్రదర్శనలు, చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అశ్వవాహన సేవకు నెల్లూరుకు చెందిన గుడె శ్రీధర్, అరుణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

కనులపండవగా పెద శేషవాహన సేవ

వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పెద శేష వాహన సేవ నిర్వహించారు. స్వామివారిని పెదశేషవాహనంపై ఆశీనులను చేసి గొలగమూడి వీధుల్లో ఉత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవం వెంట భక్తులు వేలాది సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. పెదశేష వాహన సేవకు ముత్తుకూరుకు చెందిన ఈదూరు రామ్మోహన్ రెడ్డి, సుప్రియ దంపతులు, ఈదూరు రామ్‌ప్రదీప్‌రెడ్డి, లక్ష్మీ శర్వాణి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఉత్సవాలను ఆశ్రమ కార్యనిర్వాహణాధికారి పి.బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

ఉత్సవాల్లో నేడు

వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సింహ వాహనసేవ, రాత్రి గరుడ వాహనసేవ నిర్వహించనున్నారు. రాత్రి 9 గంటలకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు.

693 పొగాకు బేళ్ల విక్రయం


మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో గురువారం 693 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 790 బేళ్లు వచ్చాయని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 89,593.7 కిలోల పొగాకు విక్రయించగా రూ.264,11,848.10 వ్యాపారం జరిగింది. కిలోకు గరిష్ఠ ధర రూ.358, కనిష్ఠ ధర రూ.204 లభించింది. సగటున రూ.294.80 ధర నమోదైంది. వేలంలో 15 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

జలదంకి: మండలంలోని జమ్మలపాళెం వద్ద ఎటువంటి రసీదులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను కలిగిరి సీఐ వెంకటనారాయణ బుధవారం రాత్రి పట్టుకున్నారు. లింగసముద్రం మండలం చిన్నపవని వాగు నుంచి ఇసుకను అక్రమంగా జమ్మలపాళెంలోని కల్యాణ మండపానికి తరలిస్తున్నట్లు గుర్తించి, ఆ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం జరిమానా విధించి విడిచి పెట్టారు.

ఎలక్ట్రికల్ లోడర్‌తో కాలుష్య నివారణ

- పోర్టు సీఈఓ జీజే రావు



ఎలక్ట్రికల్ లోడర్‌ను ప్రారంభిస్తున్న సీఈఓ జీజే రావు

ముత్తుకూరు: దేశంలో ఏ పోర్టులో కూడా లేని విధంగా అదాని కృష్ణపట్నంపోర్టులో మొదటిసారి ఎలక్ట్రికల్ లోడర్‌ను ప్రవేశ పెడుతున్నామని పోర్టు సీఈఓ జీజే రావు తెలిపారు. గురువారం పోర్టులో ఎలక్ట్రికల్ లోడర్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దీని వల్ల కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామన్నారు. మరో రెండు లోడర్లు వారంలోగా పోర్టుకు చేరుకుంటాయన్నారు. ఇది పని చేసేందుకు గంటకు 18 లీటర్ల డీజిల్ వినియోగం జరుగుతుందన్నారు. దీని ద్వారా 1157.8 కిలోల ఉద్గారాలు వెలువడతాయన్నారు. ఒక లోడర్ ఖరీదు రూ.2.80 కోట్లు ఉంటుందన్నారు. సీఓఓ రాజన్‌బాబు, లాజిస్టిక్స్ హెడ్ శ్రీధర్ , టెక్నో కమర్షియల్ హెడ్ రమేష్ బాబు, కోల్‌యార్డ్ హెడ్ విజయ్‌మజ్జి, ఈహెచ్ హెడ్ వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.

భద్రత మృగ్యం.. సర్కారు చోద్యం

కోల్‌కతా ఘటన తర్వాత వణికిపోతున్న వైద్య సిబ్బంది

- రక్షణ కల్పించాలని ఉద్యమిస్తున్న వైనం
- రాత్రి పూట విధులకు వెళ్లాలంటేనే భయం
- ప్రత్యేక నిఘా వ్యవస్థ పటిష్టం చేయాలి
- ఫిర్యాదులపై సత్వరమే చర్యలు చేపట్టాలి
- ముక్తకంఠంగా వైద్య బృందాల డిమాండ్

కోల్‌కతా ఆర్‌జీకర్ ఆస్పత్రి ఘటనకు యావత్ భారతదేశం ఉలికిపడింది. ఈ దారుణ, అమానుష ఘటనకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా వైద్యులు, వైద్య సిబ్బంది ఉద్యమ బాటపట్టారు. ఈ ఘటనతో మన ప్రభుత్వాస్పత్రుల్లో భద్రతపైనా చర్చకు దారి తీసింది. జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో భద్రత, సమస్యలు, లోపాలు వెలుగు చూశాయి. ఇలాంటి తరుణంలో రోగులకు మంచి వైద్య సేవలందించాలంటే మహిళా వైద్యులు, నర్సుల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. ఇప్పటికే జూనియర్ డాక్టర్లు అలుపెరగని ఉద్యమాలు చేస్తున్నారు. ప్రజల నుంచి సైతం వైద్య సిబ్బంది ఉద్యమానికి మద్దతు లభిస్తోంది. భద్రత దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఈ ఉద్యమం ఉగ్రరూపం దాల్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి.



ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని పీహెచ్‌సీల నుంచి పెద్దాస్పత్రి వరకు భద్రత మృగ్యంగా ఉంది. ఐదేళ్ల క్రితం వరకు ప్రభుత్వాస్పత్రులు శిథిలావస్థలో బూత్ బంగ్లాలను తలపిస్తుండేవి. క్షేత్రస్థాయిలో పీహెచ్‌సీల్లో అయితే ప్రహరీలు, గేట్లు కూడా లేని పరిస్థితి ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు పథకం కింద ప్రభుత్వాస్పత్రుల్లో శిథిలమైన భవనాలను పునర్నిర్మించడంతో పాటు ప్రహరీలు, గేట్లు వంటి కూడా ఏర్పాటు చేసింది. ఆస్పత్రుల పరిసరాలను అభివృద్ధి చేసింది. ఆస్పత్రుల్లో అటెండర్/వాచ్‌మెన్లను అవుట్‌సోర్సింగ్ విధానంలో నియమించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆస్పత్రుల్లో కొంత అభద్రతా భావం నెలకొందనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. అటెండర్/వాచ్‌మెన్లకు జీతాలు ఇవ్వకపోవడంతో కొందరు విధుల నుంచి తప్పుకుంటున్నట్లు సమాచారం. జిల్లాలో 52 పీహెచ్‌సీలు, 10 సీహెచ్‌సీలు, 28 అర్బన్ హెల్త్ సెంటర్లు, 2 ఏరియా ఆస్పత్రులు, ఆత్మకూరులో ఒక జిల్లా ఆస్పత్రి, నెల్లూరు నగరంలో ఒక టీచింగ్ ఆస్పత్రి (సర్వజన ఆస్పత్రి) ఉన్నాయి. ఆయా ఆస్పత్రుల్లో స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు, మహిళా డాక్టర్లు, జూనియర్ మహిళా డాక్టర్లు తదితర మహిళా సిబ్బంది, సుమారు 3 వేల మంది ఉన్నారు. వీరంతా రాత్రి పూట భయంతో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. పల్లె సీమల్లోని పీహెచ్‌సీలు ఊరు చివర ఉంటున్నాయి. చుట్టూ పొదలు, చెట్లు ఉంటున్నాయి. వీటిల్లో రాత్రి పూట స్టాఫ్ నర్సు ఒక్కరే విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి విధుల్లో ఉండే మహిళా డాక్టర్లు సైతం ఆందోళన చెందుతున్నారు.

పెద్దాస్పత్రిలో పరిస్థితి దారుణం

నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి పగటి పూట వచ్చేందుకు 4 గేట్లు తెరిచి ఉంటాయి. రాత్రి పూట అయితే మూడు గేట్లు తెరిచి ఉంటాయి. ఏ పక్క నుంచి ఎవరు వస్తారో తెలియని పరిస్థితి. అడిగితే వార్డులో పేషెంట్ ఉన్నారని చెబుతున్నారు. తగిన సెక్యూరిటీ లేదు. ఆస్పత్రి ఆవరణలో చాలా ఆటోలు పార్కింగ్ చేసి ఉంటున్నాయి. వీటిలో అనేక మంది మద్యం తాగి అక్కడే విశ్రాంతి తీసుకుంటూ ఉంటున్నారు. ఐపీ (ఇన్ పేషెంట్) భవనానికి సైతం రెండు దారులు ఉన్నాయి. అందులో ముందు వైపు మాత్రమే ఒకే ఒక సెక్యూరిటీ గార్డు ఉంటారు. రెండో వైపు సెక్యూరిటీ కూడా ఉండదు. ఆస్పత్రిలో రాత్రి పూట రెండు వార్డులకు కలిపి సుమారు 35 మంది రోగులకు ఒకే స్టాఫ్ నర్సు ఉంటున్నారు. పనిభారం ఎక్కువైన నర్సు తమ విధుల్లో నిమగ్నమై ఉండి ఇతర పరిస్థితులను గమనించే అవకాశం ఉండదు. ఆరు బయట చెట్ల కింద మత్తు పదార్థాలు తీసుకునే వారు సైతం ఉంటున్నారు. ఎమర్జెన్సీలో రాత్రి పూట వైద్యం కోసం రోగిని తీసుకుని వచ్చిన సహాయకులను బయట ఉండమని చెప్పినా కొంత మంది మాట వినకుండా మహిళా డాక్టర్లు, నర్సులతో వాగ్వాదానికి దిగుతున్న ఘటనలు తరచూ జరుగుతున్నాయి. మహిళా డాక్టర్ల గదుల నుంచి వార్డుల వద్దకు నిర్మానుష్యంగా ఉన్న ప్రదేశాల మీదుగానే వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. నర్సులకు ప్రత్యేకంగా వార్డుల్లో వాష్ రూంలు లేవు. దూరంగా ఉన్న వాటి వద్దకు రాత్రి వేళ ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ వెళ్తున్న పరిస్థితి అనివార్యంగా ఉంది.

ఫిర్యాదు చేసే స్వేచ్ఛ ఉండాలి

ప్రభుత్వాస్పత్రులు, మెడికల్ కళాశాలల్లో విధులు నిర్వర్తించే మహిళా ఉద్యోగులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ స్టాఫ్, జూనియర్ డాక్టర్లు తమ సమస్యలపై అధికారులకు ఫిర్యాదులు చేసే స్వేచ్ఛ కల్పించాలి. పోలీసు, న్యాయ, రెవెన్యూ వ్యవస్థల సభ్యులతో ఫిర్యాదు కమిటీలు ఏర్పాటు చేసి వీరికి స్థానం కల్పించాలి. అప్పుడు మాత్రమే లైంగిక వేధింపులు, ర్యాగింగ్ వంటి సమస్యలపై స్వేచ్ఛగా ఫిర్యాదులు చేయగలుగుతారు.

పర్యవేక్షణ, నిఘాను పటిష్ట పరచాలి



ఆస్పత్రి, మెడికల్ కళాశాలలో గాని ఇబ్బందులు రాకుండా ఉండాలంటే సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు నిరంతర పర్యవేక్షణ, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘాను పటిష్టపరచాలి. డాక్టర్లకు, వైద్య సిబ్బందికి భరోసా కల్పించేలా చర్యలు చేపట్టాలి. వైద్య కళాశాలల్లో కూడా 60 శాతానికి పైబడి యువతులే ఉంటారు. వీరి భద్రతకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. పోలీసులు, న్యాయవాదులు, ఆస్పత్రి అధికారులతో కలిపిన సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ సుబ్రహ్మణ్యం, విశ్రాంత అడ్మినిస్ట్రేటివ్ అధికారి, జీజీహెచ్

బాధతో పాటు భయం వేస్తోంది



సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు చూస్తుంటే బాధతో పాటు అత్యంత భయం వేస్తోంది. ఒక్కో దఫా ఏడుస్తున్నాం. ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై క్రూరంగా ప్రవర్తించిన మృగాళ్లను కఠినంగా శిక్షించాలి. అప్పుడే బాధితురాలి కుటుంబానికి న్యాయం జరుగుతుంది.

– డాక్టర్ కళారాణి, అడ్మినిస్ట్రేటివ్ విభాగాధిపతి, జీజీహెచ్, నెల్లూరు

డాక్టర్ల డిమాండ్లు ఇవే

- రోగుల నుంచి ఇన్‌ఫెక్షన్ ప్రబలకుండా ఉండాలంటే ప్రైవేట్ ఆస్పత్రుల్లో మాదిరిగా రోగితో పాటు ఒక సహాయకుడిని మాత్రమే వార్డులోకి అనుమతించాలి.
- మద్యం, మత్తు పదార్థాలు తీసుకున్న వ్యక్తులను ఆస్పత్రిలోనికి అనుమతించకూడదు.
- వైద్యం చేసే క్రమంలో ఎమర్జెన్సీ వార్డులో ఒక్కో దఫా ఎంత ప్రయత్నించినప్పటికీ దురదృష్టవశాత్తు రోగి మరణించిన క్రమంలో రోగి బంధు, మిత్రులు దాడులకు పాల్పడుతున్న ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇలాంటివి జరగకుండా ఉండేందుకు వార్డులో తగినంత సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలి.
- ఆస్పత్రులు, వైద్య కళాశాలల్లో పనిచేసే వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించేలా కేంద్రం రక్షణ చట్టాన్ని అమలు చేయాలి.
- కోల్‌కతా ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపించి కఠినంగా శిక్షించాలి.
- మహిళలపై హింసాత్మక దాడులకు కారణమవుతున్న నేరస్తులను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలి.
- మహిళలపై హింసను ప్రేరేపించే మద్యం, మత్తు పదార్థాలు, పోర్న్ సైట్లను నిషేధించాలి.
- పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో ప్రత్యేకంగా సెక్యూరిటీని ఏర్పాటు చేయాలి.
- వైద్యులు, సిబ్బంది తిరిగే ప్రదేశాల్లో రాత్రి వేళ తగిన లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.
- వైద్యులకు సరిపడా వాష్‌రూమ్స్, డ్యూటీ రూమ్స్ ఉండాలి. వైద్య విద్యార్థినులు అత్యధికంగా ఉండే చోట పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి.

కఠిన చట్టాలతో శిక్షించాలి



కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేయడం అత్యంత దారుణం. మహిళా డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించే వారిని శిక్షించేందుకు కఠిన చట్టాలు అమలు చేయాలి. ఇటీవల కాలంలో డాక్టర్లపై దాడులు జరుగుతున్నాయి. ప్రాణం పోస్తున్న డాక్టర్లకే ప్రాణ రక్షణ లేకపోతే ఎలా?. చట్టాల్లోని లొసుగులతో దోషులు తప్పించుకుంటున్నారు. కఠిన చట్టాలతో వేగంగా శిక్షించాలి.

– డాక్టర్ బీవీ సుష్మ

ఫాస్ట్ ట్రాక్ కోర్టులతో తక్షణ న్యాయం



మహిళలను హత్య చేసే కేసుల్లో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి సత్వరమే విచారించి న్యాయం చేయాలి. విచారణ పేరుతో కాలయాపన జరగడం, కొన్ని కేసుల్లో దోషులు తప్పించుకుంటున్నారు. ఇలాంటి పరిణామాలతోనే మళ్లీ మళ్లీ మహిళలపై దారుణాలు జరుగుతున్నాయి. దోషులను కఠినంగా శిక్షించినప్పుడే ఇలాంటివి పునరావృతం కావు. కోల్‌కతా బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలి.

– డాక్టర్ శ్రేయ

డాక్టర్లకు భద్రత కల్పించాలి



వైద్యం చేస్తున్న డాక్టర్లకు భద్రత కల్పించాలి. మహిళా డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది రాత్రి పూట విధులు నిర్వర్తించే సమయంలో పోలీసు బందోబస్తుతో పాటు రౌండ్స్ వేయాలి. ప్రధానంగా ఆస్పత్రి ప్రాంగణంలో పార్కింగ్ చేసే వాహనాలు, ఆటోలను నియంత్రించాలి. మద్యం మత్తులో ఉండే వారిని, ఇతరులను ఆస్పత్రిలోనికి అనుమతించకుండా ప్రధాన గేట్లు, వార్డుల ఎంట్రన్స్ వద్ద సెక్యూరిటీ చెకింగ్ ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ ఉత్తమ్, జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్

రక్షణ చట్టాలు తేవాలి



వైద్యం చేస్తున్న మా మీద దాడులు జరుగుతున్నాయి. ఇప్పుడు కోల్‌కతాలో మహిళా వైద్యురాలిని అత్యాచారం చేసి చంపేశారు. తప్పని పరిస్థితుల్లో మేమంతా సమ్మె బాట పట్టాల్సి వచ్చింది. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రక్షణ చట్టాలు తెచ్చేందుకు ప్రజల మద్దతు అవసరంగా భావిస్తున్నాం.

– డాక్టర్ జోయల్, జూడాల సెక్రటరీ

ఆడపిల్లగా పుట్టడమే నేరమా?



ఆడపిల్లగా పుట్టడం నేరమా? కోల్‌కతా, ఉత్తరాఖండ్‌ల్లో మహిళా డాక్టర్, నర్సుపై జరిగిన అకృత్యాలు హేయమైనవి. ఇంతటి నీచానికి పాల్పడిన వారిని వదలకూడదు. దోషులకు వేసే శిక్షలను చూసి మరొకరు ఇలాంటి పని చేయడానికి భయపడాలి. అలాంటి శిక్షలు ఉండాలి. వైద్య రంగంలో మహిళలే రాత్రి పూట ఎక్కువగా డ్యూటీలు చేస్తున్నారు. ఆస్పత్రుల్లోకి ఎవరు వస్తున్నారో.. ఎవరు పోతున్నారో అర్థం కాని పరిస్థితి ఉంది.

– సుమనలత, స్టాఫ్ నర్సు

కొవ్వొత్తులతో జూడాల నిరసన

నెల్లూరు (అర్బన్): కోల్‌కతా ఆర్‌జీకర్ ఆస్పత్రిలో పీజీ ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచారాన్ని, హత్యను నిరసిస్తూ జూనియర్ డాక్టర్లు వారం రోజులుగా ఆందోళన చేస్తున్నారు. అందులో భాగంగా నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద జూనియర్ డాక్టర్లు పలువురు గురువారం రిలే దీక్షలు చేశారు. జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పీర్స్ జోయల్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తమ సమస్యలపై టాస్క్ ఫోర్స్ కమిటీ వేసిందన్నారు. అయితే ప్రభుత్వం విధుల్లో ఉన్న డాక్టర్ల రక్షణకు తీసుకునే విధంగా చట్టం చేసేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన

మహిళా డాక్టర్‌కు జూడాలతో పాటు పలు సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వీఆర్‌సీ గ్రౌండ్‌లో కొవ్వొత్తుల ప్రదర్శనతో నివాళులర్పించారు. జూనియర్ డాక్టర్లకు మద్దతుగా యూటీఎఫ్, జనవిజ్ఞాన వేదిక, ఐద్వా మహిళా సంఘం నాయకులు, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, నారాయణ మెడికల్ కళాశాల విద్యార్థులతో పాటు పలు కళాశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు తరలివచ్చారు. కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శనతో మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.



నిరాహార దీక్షలు చేస్తున్న జూనియర్ డాక్టర్లు




కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న జూడాలు, వివిధ సంఘాలు

ఇసుక రవాణా చార్జీలు నిర్ణయం

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (దర్గామిట్ట): ప్రజలకు ఇసుక రవాణా భారం తగ్గించడానికి రవాణా ధరలు నిర్ధారించామని కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. గురువారం కలెక్టర్ ట్రాన్స్‌పోర్టర్లు, రవాణాశాఖ అధికారులతో తిక్కన ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో మర్రిపాడు ఇసుక డిపోలో 36 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, ఇక్కడ నుంచి రోజుకు వెయ్యి టన్నుల ఇసుక సరఫరా అవుతుందన్నారు. స్టాక్ పాయింట్ దూరంగా ఉండడం వల్ల ధర ఎక్కువగా ఉందని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీనిపై డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ద్వారా ఇసుక రవాణా చార్జీలను నిర్ణయించామన్నారు. ఈ రేట్లకు ట్రాన్స్‌పోర్టర్లు కూడా అంగీకరించారని కలెక్టర్ తెలిపారు. ఇసుకకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నట్లయితే టోల్ ఫ్రీ నంబరు 08961–2943569కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. స్టాక్ యార్డు వద్ద టన్ను ఇసుక ధర రూ.370గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మర్రిపాడు తహసీల్దారు కార్యాలయం వద్ద బుకింగ్ పాయింట్ ఏర్పాటు చేయడం జరిగిందని, అక్కడ ఒక ఉద్యోగిని నియమించడం జరిగిందన్నారు. ఇసుక రవాణా చేసే వాహనాలను మైన్స్‌శాఖ ద్వారా ఎంప్యానల్ చేశామన్నారు, ఇసుక అవసరమైన వారు అందుబాటులో ఉన్న ఎంప్యానల్ వాహనాలను బుక్ చేసుకోవచ్చు. సొంత వాహనాల ద్వారా తీసుకెళ్లవచ్చన్నారు. ఇసుక సరఫరా, అధిక రేట్లు వసూలు చేసిన, రవాణాలో అక్రమాలకు పాల్పడితే సెబ్, పోలీస్ అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను ఉపేక్షించేది లేదని, బ్లాక్ మార్కెటింగ్ అక్రమ దందాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మర్రిపాడులో ఉన్న ఇసుక డిపో వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. స్టాక్ పాయింట్ ప్రాంతానికి వే బిల్లులు, టైం స్లాట్‌లో ఉన్న వాహనాలను మాత్రమే అనుమతి ఇస్తామన్నారు. టోల్ ప్లాజా వద్ద టీంలు ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు చేస్తామన్నారు. ట్రాన్స్‌పోర్టర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో జేసీ కార్తీక్, మైన్స్ డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చందర్, ఆర్టీఓలు, ఇసుక సరఫరా ట్రాన్స్‌పోర్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీలు

పది టన్నుల లారీ

దూరం (కి.మీ)	ధర
5	రూ.1,500
15	రూ.2,000
30	రూ.3,500
45	రూ.4,500
60	రూ.5,500

60 కి.మీ. కంటే ఎక్కువ దూరం ఉంటే ప్రతి టన్నుకు కి.మీ.కు రూ. 9 అదనపు చార్జీ

4 టన్నుల సామర్థ్యం కలిగిన ట్రాక్టర్

దూరం (కి.మీ)	ధర
5	రూ.800
15	రూ.1,500
30	రూ.2,400
45	రూ.3,000
60	రూ.3,500

60 కి.మీ. కంటే ఎక్కువ దూరం ఉంటే ప్రతి టన్నుకు కి.మీ.కు రూ.12 అదనపు చార్జీ

కేఎన్నార్ హైస్కూల్ హెచ్‌ఎం సస్పెన్షన్

నెల్లూరు (టౌన్): నగరంలోని భక్తవత్సలనగర్‌లో ఉన్న కేఎన్నార్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం కె.విజయప్రకాష్‌ను సస్పెండ్ చేస్తూ ఈ మేరకు ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కేఎన్నార్ మున్సిపల్ పాఠశాలలో గత నెల 26న సన్‌షేడ్ కూలి 9వ తరగతి చదువుతున్న విద్యార్థి గురుమహేంద్ర మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి విచారణాధికారిగా నియమించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. పాఠశాలలో భవన నిర్మాణం జరుగుతున్న సమయంలో పాఠశాల హెడ్‌మాస్టర్ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడం, జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహించారని విచారణలో స్పష్టమైంది. నివేదిక ఆధారంగా హెచ్ ఎంను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు అందాయి.

క్లుప్తంగా

సీఐల బదిలీ

నెల్లూరు(క్రైమ్): గుంటూరు రేంజ్ పరిధిలో 13 మంది సీఐలను బదిలీ చేస్తూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులను గురువారం జారీ చేశారు. ఎస్సీ, ఎస్టీ సెల్ – 1 ఇన్‌స్పెక్టర్ సురేష్‌బాబును బాపట్ల జిల్లా రేపల్లె రూరల్‌కు.. రేంజ్ వీఆర్‌లో ఉన్న పాపారావును కావలి రూరల్‌కు.. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను గూడూరు టూ టౌన్‌కు.. మెరైన్‌లో ఉన్న కిశోర్‌కుమార్‌ను వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. బదిలీ అయిన వారు విధుల్లో వెంటనే చేరాలని ఆదేశించారు.

అదుపుతప్పిన కారు

- ఇద్దరికి గాయాలు

జలదంకి: కారు అదుపుతప్పడంతో ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని తొమ్మిదో మైలు చీకటివాగు వద్ద గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తొమ్మిదో మైలులో వివాహ వేడుకకు వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన తిప్పరపాటి సుధాకర్, విజయలక్ష్మి దంపతులు బుధవారం వచ్చారు. ఈ క్రమంలో టీ తాగేందుకు జలదంకికి కారులో వచ్చారు. అనంతరం బయల్దేరగా, చీకటివాగు వద్దకొచ్చేసరికి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని వాగులోకి పల్టీలు కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వారికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను కావలిలోని వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనధికార లేఅవుట్ల గుర్తింపు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో ఎలాంటి అనుమతుల్లేకుండా ఏర్పాటు చేసిన అనధికార లేఅవుట్లను అధికారులు గుర్తించారు. కార్పొరేషన్‌కు సంబంధించిన 54 డివిజన్లలో అనధికార లేవుట్లు 40 మేర ఉన్నాయని తాము గుర్తించామని కమిషనర్ సూర్యతేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన జాబితాను సిద్ధం చేశామన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని అల్లీపురం, గుడిపల్లిపాడు, పెద్దచెరుకూరు, గుండ్లపాళెం, వావిలేటిపాడు తదితర ప్రాంతాల్లో ఉన్నాయని చెప్పారు. ఆయా లేఅవుట్లలో ప్లాట్లు రిజిస్ట్రేషన్ కావన్నారు. అనధికార లేఅవుట్లలో ప్లాట్లను కొని మోసపోవద్దని సూచించారు. అనుమతుల్లేకుండా వీటిని ఏర్పాటు చేసి విక్రయాలు సాగిస్తున్న స్థల యజమానులు, డెవలపర్లపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.100
సన్నవి : రూ.60
పండ్లు: రూ.40

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.114
లేయర్	రూ.105
బ్రాయిలర్ చికెన్	రూ.210
స్కిన్‌లెస్ చికెన్	రూ.230
లేయర్ చికెన్	రూ.178

ఉపాధిలో మాయాజాలం

- నకిలీ మస్టర్లు.. దొంగ ఫొటోలు
- మండలానికి సుమారు 350 నుంచి 450 వరకు ఇలా..
- పేరు ఒకరిదైతే.. ఉండేది ఇంకొకరు
- తలలు పట్టుకుంటున్న అధికారులు



కందుకూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అధికార పార్టీ నేతలు మాయాజాలాన్ని ప్రదర్శిస్తున్నారు. నకిలీ మస్టర్లు.. దొంగ ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసి అధికారులను బురిడీ కొట్టిస్తున్నారు. పేరు ఒకరిదైతే.. ఫొటో ఇంకొకరిది ఉంటుంది. నాలుగైదు పేర్లకు ఒకే వ్యక్తి ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ పరిణామాల క్రమంలో ఏమి చేయాలో పాలుపోక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఓవైపు కూలీల నుంచి వారానికి రూ.వంద వసూళ్లను నియంత్రించే పనిలో ఉంగా.. ఇంతలోనే దొంగ మస్టర్లు వేస్తూ అధికారులకు చుక్కలు చూపుతున్నారు.

ఎన్నెన్నో సిత్రాలు

గ్రామాల్లో చోటా నేతలు అసలు పని వద్దకే వెళ్లరు. అయితే వారి పేరుపై మస్టర్‌లో హాజరుపడుతోంది. కందుకూరు మండలం ఓగూరులో కృష్ణ పనికెళ్లరు. అయితే ఆయన పేరు మస్టర్‌లో దర్శనమిస్తోంది. ఫొటోలో మాత్రం వేరే వ్యక్తి ఉంటారు. ఇలా కిరణ్ కుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రఘుబాబు, పిచ్చెమ్మ, కృష్ణ పనికెళ్లకపోయినా మస్టర్‌లో పేర్లుంటున్నాయి.

వైఎస్సార్సీపీకి అనుకూలమా.. అంతే..!

పాలూరులో సీనియర్ మేట్ పక్షపాత ధోరణిని ప్రదర్శిస్తున్నారు. టీడీపీకి అనుకూలమైన కూలీలకు తొమ్మిది గంటల్లోపే మస్టర్లు వేసి ఇళ్లకు పంపుతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలమైన కూలీలకు 12 గంటల వరకు మస్టర్లు వేయకుండా పనుల వద్దే కూర్చోబెడుతున్నారని పలువురు వాపోతున్నారు.

అంతా గోల్‌మాల్..

కందుకూరు నియోజకవర్గంలోని కందుకూరు మండలంలో 3337, లింగసముద్రంలో 3191, గుడ్లూరులో 3779, వలేటివారిపాళెంలో 1961, ఉలవపాడులో 1321 మంది కూలీలు పనులు చేస్తున్నారు. వాస్తవానికి కందుకూరు మండలంలో ఉపాధి సీజనైన ఏప్రిల్, మే, జూన్‌లో పనులకు సుమారు 3600 నుంచి 3800 మంది వరకు కూలీల హాజరవుతారు. ఆ నెలల్లో వ్యవసాయ పనులు పూర్తయి, ఇతర పనుల్లేక పోవడంతో ఉపాధి పనులకు ఎక్కువ మంది వెళ్తుంటారు. అయితే ఈ ఏడాది ఆగస్టులో 3337 మంది కూలీలు పనులకొచ్చారని అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. వాస్తవానికి శ్రావణ మాసం, అందులోనూ వరలక్ష్మీ వ్రతాన మహిళలు ఎక్కువ మంది పనులకెళ్లరు. అయినా కందుకూరు మండలంలో కూలీల సంఖ్య ఏ మాత్రం తగ్గలేదు. దొంగ మస్టర్లు ఎన్ని వేస్తున్నారనే అంశం ఈ విషయం ద్వారా స్పష్టంగా అర్థమవుతోంది. మండలానికి రోజూ సుమారు 350 నుంచి 450 మంది వరకు దొంగ మస్టర్లు పడుతున్నాయి. ఏపీఓ, ఈసీ, ఏపీడీ వంటి అధికారులు తనిఖీలకెళ్లిన సమయాల్లో హాజరు శాతం కొంత తగ్గుతోంది. లేకపోతే పూర్తి హాజరు నమోదవుతోంది.

సింగిల్ జాబ్ కార్డుకు ఒత్తిళ్లు

2014 నుంచి 2019 మధ్య టీడీపీ ప్రభుత్వంలో సింగిల్ జాబ్ కార్డులు అధిక సంఖ్యలో ఉండేవి. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడ్డాక వీటిని తొలగించారు. ఏ గ్రామంలోనూ సింగిల్ జాబ్ కార్డు కనిపించకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఒక కుటుంబానికి ఒకే జాబ్ కార్డు ఉండాలి. ఆ కుటుంబంలో ఎవరైనా పనికి వెళ్లాలనుకుంటే ఆ కార్డులో యాడ్ చేసుకోవాలి. అయితే ప్రస్తుతం అధికార పార్టీ నేతలు సింగిల్ జాబ్ కార్డులు మంజూరు చేయాలంటూ దరఖాస్తులు తీసుకొచ్చి ఏపీఓలపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఇలా చేయకూడదని చెప్తున్నా, కచ్చితంగా చేయాల్సిందేనని పట్టుబడుతున్నారు. దీంతో బదిలీలపై వెళ్లేందుకు అధికారులు ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడ పని చేయలేమని పేర్కొంటున్నారు.

నా దృష్టికి రాలేదు

ఏదో ఒక గ్రామంలో రోజూ తనిఖీ చేస్తున్నా. దొంగ మస్టర్లు పడకుండా చర్యలు చేపడతాం. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు తప్పవు. సింగిల్ జాబ్ కార్డుల మంజూరుకు వీల్లేదు. అలాంటివి వస్తున్నాయనే విషయం నా దృష్టికి రాలేదు.

– బాబూరావు, ఏపీడీ

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రస్థాయి టీ – 20 తాటిపర్తి సునీల్‌కుమార్ స్మారక ఇన్విటేషన్ వెటరన్ క్రికెట్ పోటీలను బుజబుజనెల్లూరులోని సీఏపీ క్రికెట్ మైదానంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడారు. పోటీల్లో హైదరాబాద్, అనంతపురం, కడప, గుంటూరు, కృష్ణా, నెల్లూరు జిల్లాల సీనియర్ వెటరన్ జట్లు తలపడుతున్నాయని వివరించారు.

హోరాహోరీగా పోటీలు..

- మొదట జరిగిన మ్యాచ్‌లో గుంటూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. బ్యాటింగ్ ఎంచుకున్న గుంటూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 263 పరుగులు చేసింది. భరత్ కుమార్ 66 బంతుల్లో 175.. అమన్ 52 పరుగులు సాధించారు. అనంతరం బరిలోకి దిగిన అనంతపురం జట్టు 144 పరుగులకే పరిమితమై ఓటమిపాలైంది.
- మధ్యాహ్నం జరిగిన రెండో మ్యాచ్‌లో నెల్లూరు, విజయవాడ జట్లు పోటీపడ్డాయి. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన నెల్లూరు జట్టు 202 పరుగులు సాధించింది. జట్టులోని రాజకృష్ణ 129 పరుగులు సాధించారు. అనంతరం బరిలోకి దిగిన విజయవాడ జట్టు 17 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 167 పరుగులు సాధించింది. ఈ తరుణంలో వర్షం పడటంతో డీఎల్‌ఎస్ పద్ధతిలో నెల్లూరు జట్టు ఏడు పరుగుల తేడాతో విజయం సాధించిందని అంపైర్లు ప్రకటించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

- ఆదాల ప్రభాకర్‌రెడ్డి



నేతలతో ముచ్చటిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: సాధారణ ఎన్నికల అనంతరం ఓటమితో డీలాపడిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నేతలు, కార్యకర్తలకు అండగా ఉంటానని పార్టీ రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ మండలంలోని మాదరాజుగూడూరులో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, ఎంపీపీ బూడిద విజయ్‌కుమార్‌యాదవ్, పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డితో కలిసి గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పార్టీ కార్యకర్తలు, నేతల నివాసాలకెళ్లి వారికి భరోసా కల్పించారు. పార్టీ నాయకత్వం అండగా ఉంటుందని చెప్పారు. నేతలు ఆళ్ల మనోహర్‌రెడ్డి, పందిపాటి గోపాల్‌రెడ్డి, తాంద్ర సుధాకర్, చెంచురెడ్డి, ఉమ్మడిశెట్టి సుధాకర్, నెలవాయి చంద్రారెడ్డి, ఆళ్ల పరంధామిరెడ్డి, పుట్టయ్య, అనిల్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెన్నాలో మునిగి డ్రైవర్ మృత్యువాత



నెల్లూరు(క్రైమ్): పెన్నాలో మునిగి లారీ డ్రైవర్ మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు వారధి సెంటర్‌కు చెందిన వెంకటరమణయ్య (52)కు మదనపల్లికి చెందిన నాగవేణితో వివాహమైంది. చిత్తూరు జిల్లా పీలేరులో నివాసం ఉంటూ లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. పెన్నా వారధి సెంటర్‌లో ఉంటున్న చెల్లెలు లక్ష్మి ఇంటికి తరచూ వస్తుంటారు. ఈ తరుణంలో సోదరి ఇంటికి మంగళవారం వచ్చిన ఆయన, బుధవారం బయటకెళ్లారు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో పీలేరు వెళ్లి ఉంటారని చెల్లెలు భావించారు. ఈ తరుణంలో పెన్నా బ్యారేజీ తూర్పు వైపున పెన్నాలో వ్యక్తి మృతదేహం తేలుతోందంటూ చుట్టుపక్కల వారు మాట్లాడుకుంటుండగా, విన్న లక్ష్మి ఘటన స్థలానికెళ్లారు. మృతదేహం తన అన్నదేనంటూ ఆమె బోరున విలపించారు. సమాచారం అందుకున్న సంతపేట పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి శరీరంపై డ్రాయర్ మాత్రమే ఉండగా, మిగిలిన దుస్తులు సమీపంలోని గోడపై ఉన్నాయి. దీంతో స్నానం చేసేందుకు నదిలోకి దిగి ప్రమాదవశాత్తు మృతి చెంది ఉండొచ్చని మృతుడి సోదరి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుల అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న పోలీస్ అధికారులు

ఆత్మకూరు: ఏఎస్‌పేట మండలంలోని రాజవోలు శివార్లలో బడ్డీ కొట్టును నిర్వహిస్తున్న కరేటి పెంచలమ్మ మెడలోని చైన్‌ను లాక్కెళ్లిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో సంగం సీఐ వేమారెడ్డి, ఏఎస్‌పేట ఎస్సై ప్రసాద్‌రెడ్డితో కలిసి వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. పొట్టేపాళేనికి చెందిన బద్దెపూడి నాగేంద్ర, బోగోలు మండలం ఇబ్రహీంపేటకు చెందిన మొగిలిగుండ్ల రాజశేఖర్ చెడు వ్యసనాలకు బానిసలై జల్సాలు చేసి అప్పుల పాలయ్యారని తెలిపారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో చైన్ స్నాచింగ్ నేరాలకు పాల్పడుతున్నారని చెప్పారు. రాజవోలులో జరిగిన బంగారు సరుడు దొంగతనంలో ఎస్సై, సీఐలు 48 గంటల వ్యవధిలోనే నిందితులను గుర్తించి పొట్టేపాళెం వద్ద గురువారం అదుపులోకి తీసుకున్నారని వివరించారు. 20 గ్రాముల బంగారు సరుడు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నామని తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో విశేష ప్రతిభ చూపిన వారిని ఎస్పీ అభినందించారన్నారు.

చోరీకి యత్నం

- ఎల్‌హెచ్‌ఎమ్మెస్‌తో అప్రమత్తమైన పోలీసులు


నెల్లూరు(క్రైమ్): తాళమేసిన ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి యత్నించారు. అయితే ఇంట్లో అమర్చిన ఎల్‌హెచ్‌ఎమ్మెస్ పరికరం పోలీసులను అప్రమత్తం చేసింది. విషయాన్ని గమనించిన దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. వివరాలు.. వెంకటేశ్వరపురంలోని ఇస్లాంపేటలో గల లక్ష్మీవీధిలో నివాసం ఉంటున్న ఇరిగేషన్ ఉద్యోగి శ్రీధర్ తన కుటుంబంతో కలిసి రెండు రోజుల క్రితం ఊరెళ్లారు. దానికి ముందు తన ఫోన్లోని ఎల్‌హెచ్‌ఎమ్మెస్ ఏపీ పోలీస్ యాప్‌లో రిక్వెస్ట్ పోలీస్ వాచ్‌ను పెట్టారు. ఈ క్రమంలో ఇంటికి చేరుకొని వైర్‌లెస్‌తో కూడిన మోషన్ కెమెరాను పోలీసులు అమర్చారు. ఈ తరుణంలో ఇంట్లో చోరీకి గుర్తుతెలియని దుండగులు గురువారం తెల్లవారుజామున యత్నించారు. దీంతో కెమెరాలోని అలారమ్ మోగడంతో పాటు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు హెచ్చరికలు వెళ్లాయి. నవాబుపేట పోలీసులు అప్రమత్తమై ఘటన స్థలానికి చేరుకునేలోపే దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు.

గోవుల తరలింపులో ఉద్రిక్తత



నెల్లూరు(బారకాసు): గోవులను గోశాలకు తరలించే ప్రక్రియలో కార్పొరేషన్, పోలీస్ అధికారులు.. యజమానులతో పాటు అధికార పార్టీకి చెందిన పలువురు చోటా నేతల మధ్య ఉద్రిక్తత నెలకొంది. నగరంలోని 48వ డివిజన్ పరిధిలో గల గో సంరక్షణ కేంద్రం వద్ద ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. నగరంలోని రోడ్లపై గోవులు సంచరిస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇదే విషయమై కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో మంత్రి నారాయణకు వినతిపత్రాలను పలువురు ఇటీవల సమర్పించారు. ఈ తరుణంలో నగరంలో గోవులు ఎక్కడెక్కడ సంచరిస్తున్నాయో గుర్తించి వాటిని కల్లూరుపల్లిలోని గోశాలకు కార్పొరేషన్ అధికారుల సమక్షంలో తరలిస్తున్నారు. తాజాగా 48వ డివిజన్లోని గో సంరక్షణ కేంద్రంలో ఉన్న గోవులను కల్లూరుపల్లి తరలించేందుకు వాహనాలను సిద్ధం చేశారు. దీంతో కొందరు యజమానులు అక్కడికి వచ్చి తమ ఆవులు రోడ్లపై లేవని.. ఈ తరుణంలో వీటిని వాహనంలోకి ఎందుకు ఎక్కిస్తున్నారంటూ సంబంధిత అధికారులను ప్రశ్నిస్తూ వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులకు కార్పొరేషన్ అధికారులు ఫిర్యాదు చేయగా, వారు రంగంలోకి దిగారు. సందట్లో సడేమియాగా అధికార పార్టీకి చెందిన కొందరు చోటా నేతలు ఘటన స్థలానికి వచ్చి కొందర్ని రెచ్చగొట్టారు. అక్కడున్న అధికారులతో వారు మాట్లాడుతుండగా, గో సంరక్షణ కేంద్రంలో ఉన్న ఆవులను యజమానులు బయటకు తోలారు. దీంతో ఒక్కసారిగా అవి పరుగులు పెట్టి వాహనదారులు, పాదచారులపైకి దూసుకెళ్లాయి. ఫలితంగా అక్కడ గందరగోళం నెలకొంది. దీంతో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. ఇదే సమయంలో అధికారులపై పలువురు దాడి చేశారని సమాచారం. ఘటనపై పోలీస్ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తానని అధికారి వెల్లడించారు.

ఈ వేధింపులు భరించలేమయ్యా..!



- బదిలీ చేయండి.. లేకపోతే రాజీనామాలే శరణ్యం
- ఉదయగిరి సీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది వేదన
- సీనియర్ డాక్టర్ చేష్టలతో హడలిపోతున్న వైనం
- పరిస్థితిని చక్కదిద్దలేక చేతులెత్తేసిన అధికారులు

ఉదయగిరి: ఉదయగిరిలో గల సామాజిక ఆరోగ్య కేంద్రం వివాదాలకు నిలయంగా మారింది. రోగులకు సేవలను అందించాల్సిన వైద్య సిబ్బంది మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. సీనియర్ వైద్యుడు టాగూర్ వ్యవహార శైలి, ఆయన చేష్టలను తాము భరించలేకపోతున్నామని కొందరు వైద్యులు, సిబ్బంది తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కన్నీరుపెట్టుకున్న డీడీఓ

ఆస్పత్రిలోని ఓపీ గదిలో డీడీఓ అనీషా.. వైద్యుడు టాగూర్ మధ్య డీసీహెచ్‌ఓ ఫోన్ లైన్లో ఉండగానే వాగ్వాదం గురువారం చోటుచేసుకుంది. మీ వేధింపులను భరించలేం.. గర్భిణినైన తాను ఈ ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నానంటూ అనీషా కన్నీరు పెట్టుకున్నారు. ఈ పరిణామంతో రోగులు, సహచర వైద్యసిబ్బంది అవాక్కయ్యారు.

నిత్యం గొడవలే..

ఈ క్రమంలో అనీషా అనే జూనియర్ వైద్యురాలికి డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంట్ ఆఫీసర్ (డీడీఓ) పవర్ ఇచ్చారు. ఇది భరించలేక జూనియర్లు, సిబ్బందితో నిత్యం గొడవపడుతూ, వైద్యశాలకు వచ్చే రోగులకు పలు అబద్ధాలు చెప్తూ ఇబ్బంది పెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కాగా తనపై ఆరోపణలు వాస్తవం కాదని.. విధులను సక్రమంగా నిర్వర్తించాలనే తాను సూచిస్తున్నానని టాగూర్ చెప్పారు.

ఆది నుంచి ఇదే తీరు..



గైనకాలజిస్ట్ టాగూర్ సర్వీస్ అంతా వివాదాస్పదమే. పొదలకూరులో పనిచేసే సమయంలో వేధింపుల కేసులో సస్పెండయ్యారు. అనంతరం 2016లో ఉదయగిరి సీహెచ్‌సీలో విధుల్లో చేరారు. అప్పట్లో ఓ స్టాఫ్ నర్సుతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో వైద్యశాలలోనే దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించడంతో కేసు నమోదు చేశారు. విచారణలో ఉండగానే వారి కళ్లుగప్పి పరారయ్యారు. అనంతరం 2022లో మరోసారి ఇక్కడే విధుల్లో చేరారు. ఈ తరుణంలో ఆయనకు డీడీఓ అధికారాన్ని ఇవ్వలేదు. ఈ రెండేళ్లలో ఆయన తీరుతో ముగ్గురు డీడీఓలు విసిగిపోయి వేరే చోటకు వెళ్లిపోయారు.

వైద్యం మృగ్యం

ఉదయగిరిలో 50 పడకల వైద్యశాలలో 12 మంది వైద్యులకు గాను నలుగురే ఉన్నారు. జనరల్ వైద్యుడు వరుణ్ గతేడాది ఫిబ్రవరిలో డిప్యుటేషన్‌పై కోవూరుకు వెళ్లారు. గైనకాలజిస్ట్ అనుశక్తి ఆర్నెల్ల క్రితం చిత్తూరు జిల్లా నారావారిపల్లికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. మరో జనరల్ వైద్యులు షఫ్రా మూడు నెలలుగా విధులకు రావడంలేదు. దంత వైద్యులు వారంలో మూడు రోజుల పాటే విధులకు వస్తున్నారు. జనరల్, పీడియాట్రిక్, ఈఎన్టీ, జనరల్ మెడిసిన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మహిళా గైనకాలజిస్ట్ డిప్యుటేషన్‌పై వెళ్లడంతో ఇక్కడ సిజేరియన్లు జరగడంలేదు. టాగూర్ సైతం గైనకాలజిస్టే నైనా ఆపరేషన్లు చేసినా అనుభవం లేదంటూ తప్పించుకుంటున్నారు.

పని చేయలేకపోతున్నాం



సీనియర్ వైద్యుడు టాగూర్ తీరుతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. తనకు డీడీఓ పవర్ ఇచ్చారనే ఆక్రోశంతో అనేక రకాలుగా ఇబ్బంది పెడుతున్నారు. ఈ బాధ్యత నుంచి తప్పించాలని కోరుతున్నా, అధికారులు పట్టించుకోవడం లేదు. – అనీషా, డీడీఓ, ఉదయగిరి